క్లుప్తంగా

జీఓ ప్రకారం పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

టేకులపల్లి: జీఓ 3 ప్రకారం ఏజెన్సీలో పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ... పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు, కేజీబీవీ పాఠశాలల సిబ్బంది జీతాలు విడుదల చేయాలని మరియు పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. భూక్యా శంకర్‌నాయక్, వాంకుడోత్ రమేష్ బాబు, ఎ.బన్సీలాల్, బాలు, యుగేందర్, రమేష్, మంగీలాల్, రాంకిషన్, లక్ష్మణ్, బాలాజీ, గోర్యా, సురేష్, సక్రం, మోహన్, విష్ణుప్రియ రాథోడ్, రాధ, పార్వతి, శాంతి పాల్గొన్నారు.

హాకీ కిట్లు అందజేత



క్రీడా సామగ్రి అందిస్తున్న సీఈ

పాల్వంచ: కేటీపీఎస్ 7వ దశకు చెందిన హాకీ క్రీడాకారులకు గురువారం సీఈ కార్యాలయంలో సీఈ పి.వెంకటేశ్వరరావు రూ.30వేల విలువగల హాకీ కిట్లను పంపిణీ చేశారు. గేమ్స్ సెక్రటరీలు వై.వెంకటేశ్వర్లు, టి.వీరస్వామి, డీఈ ఎస్ఎన్ఎస్.శేఖర్, ట్రెజరర్ ఎస్ఎల్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయాన్ని తొలగించుకోవాలి

పాల్వంచ: విద్యార్థులు పరీక్షలు అంటే భయాన్ని తొలగించుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు జవ్వాది వెంకటేశ్వరబాబు అన్నారు. గురువారం స్థానిక కొమ్ముగూడెం, పాత పాల్వంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ఒత్తిడి, భయం అధిగమించడమెలా అనే అంశంపై అవగాహన కల్పించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

పాల్వంచరూరల్: మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పారిశుద్ధ్య సమస్యలపై గురువారం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మనుపురి ప్రభాకర్, గంధం ప్రసాద్ గౌడ్, లట్టి మురళీ, మాలోతు ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంపై విచారణ

చుంచుపల్లి: కలెక్టర్ ఆదేశాల మేరకు నందా తండాలోని వివాదాస్పద స్థలంపై గురువారం పంచాయతీ కార్యదర్శుల బృందం విచారం చేపట్టింది. స్థలంలో ఇళ్ల నిర్మాణం, ఖాళీ ప్రదేశాలను సమోదు చేసుకున్నారు. తహసీల్దార్ పానెం కృష్ణ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, ఆర్ఐ మంగ్యా, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయండి

కొత్తగూడెంఅర్బన్: పట్టణంలోని వార్డుల్లో మంజూరైన విద్యుత్ స్తంభాలను తక్షణమే ఏర్పాటు చేయాలని 23వ వార్డు కౌన్సిల్ వై.శ్రీనివాసరెడ్డి అన్నారు. పగిలిపోయి ప్రమాదంగా ఉన్న పింగాణి ఇన్సులేటర్స్‌ను గురువారం మార్పించి కొత్తవి ఏర్పాటు చేయించారు. అనంతరం మాట్లాడారు.

భాగవతాన్ని పఠిస్తే మోక్షమార్గం

కొత్తగూడెంటౌన్: భాగవతము అనే వేదాన్ని భక్తిశ్రద్ధలతో పఠిస్తే మోక్షం లభిస్తుందని ప్రవచకులు లట్టి జగన్మోహన్ అన్నారు. గురువారం కొత్తగూడెం పట్టణ పరిధిలోని హేమచంద్రాపురంలోని శ్రీకోదండరామాలయంలో భాగవతము ప్రవచనాలను భక్తులకు వినిపించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

అభివృద్ధి పనులు జాప్యం!

- పంచాయితీ తెగేదెన్నడో.. రోడ్ల నిర్మాణం ఎప్పుడో?
- పనుల కేటాయింపు వివాదంలో రూ.70 లక్షల నిధులు
- అధికారులకు తలనొప్పిగా మారిన తాజా వైరం



ఇందిరానగర్‌లో సీసీ వేయాల్సిన రోడ్డు

ఇల్లెందురూరల్: అసెంబ్లీ ఎన్నికల వేళ గత ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా పలు పథకాల పేరుతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసింది. వీటిలో అత్యధికం సీసీ రోడ్లే కావడం గమనార్హం. పనులన్నింటినీ నామినేషన్ పద్ధతిలో గ్రామపంచాయతీలకు కేటాయించారు. వీటిని దక్కించుకునేందుకు అప్పటి అధికార పార్టీ నాయకులు పోటీ పడ్డారు. కానీ సకాలంలో పనుల ప్రారంభించడంలో విఫలమయ్యారు. దీంతో మండల వ్యాప్తంగా రూ.కోటి నిధులు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో ప్రస్తుత అధికార పార్టీ శ్రేణులు ఆయా పనులు దక్కించుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో పనులు నిలిచిపోయాయి.

పెండింగ్‌లో రూ.కోటి నిధులు...

గత ప్రభుత్వ హయాంలో డీఎంఎఫ్‌టీ పథకంలో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరానికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరయ్యాయి. వీటిలో ప్రస్తుతం రూ.కోటి వ్యయంతో పనులు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీలో రూ.30 లక్షల వ్యయంతో పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇంకా ఇందిరానగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో నాలుగు పనులు, మాణిక్యారంలో రూ.20 లక్షల వ్యయంతో నాలుగు పనులు, సుభాష్‌నగర్‌లో రూ.30 లక్షల వ్యయంతో ఆరు పనులు చేపట్టాల్సి ఉంది. అంటే తాజా పరిణామాలతో రూ.70లక్షల నిధులు వివాదాల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది.

అధికారులకు తలనొప్పిగా మారిన వైరం..

గత ప్రభుత్వ హయాంలో డీఎంఎఫ్‌టీ పథకంలో భాగంగా మంజూరైన నిధులలో ప్రారంభం కాని పనులను తాము దక్కించుకోవాలని ప్రస్తుత అధికార పార్టీ నాయకులు పట్టుబడుతున్నారు. ఇప్పటికే అగ్రిమెంట్ కూడా పూర్తయినప్పటికీ పనుల మార్పిడి వివాదం తెరమీదకు రావడంతో నిర్మాణాలు జరగడం లేదన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఇదే విషయంలో ఇటీవల జరిగిన సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పాలకవర్గం చివరి సమావేశంలోనూ ఆయా పనులకు సంబంధించి మాత్రమే సభ్యుల మధ్య వివాదం చోటుచేసుకోవడం గమనార్హం. ఇదే తరహాలో ఇందిరానగర్, మాణిక్యారం గ్రామపంచాయతీలలోనూ ప్రస్తుత అధికార, విపక్ష నేతల మధ్య అభివృద్ధి పనులపై రగడ జరుగుతోంది.

పనులు ప్రారంభమయ్యేదెన్నడో..

మండలంలోని మూడు గ్రామపంచాయతీల పరిధిలో రూ.70 లక్షల వ్యయంతో 14 చోట్ల సీసీ రోడ్లు వేయాల్సి ఉంది. ఆయా పనులు ప్రారంభించేందుకు ఎదువుతున్న సమస్య మిస్టరీగా ఉంది. ఎక్కడా వివాదం తెరమీదకు రాకుండా గుంబనంగా సాగుతుండటంతో అధికారులు సైతం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఉత్సాహం చూపడం లేదు. అటు అధికార పక్షం వేచి చూస్తోంది. గతంలో పనులు దక్కించుకున్న వ్యక్తులు సైతం అధికారుల ఆజ్ఞ కోసం వేచిచూస్తున్నారు. ఇరువర్గాల మధ్య వైరం వీడి పనుల కేటాయింపు ఎప్పుడు జరుగుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

వేసవికి ముందే...

ప్రస్తుతం చలికాలం చివరికి వచ్చింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి మించి నమోదవుతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో పనులు మరికొంత కాలం ఇలాగే వేచిచూసే ధోరణిలో కొనసాగితే ఎండలు మరింత ముదిరే ప్రమాదం లేకపోలేదు. ఆ సమయంలో సీసీ రోడ్ల పనులు ప్రారంభిస్తే క్యూరింగ్ సక్రమంగా చేయని పక్షంలో సీసీ వేసినా నాణ్యంగా ఉండదు. గడిచిన రెండేళ్లుగా వేసవిలో కాంట్రాక్టర్లు చేసిన పనులు ప్రస్తుతం కంకర తేలి నడవడానికే ఇబ్బందిగా ఉంది. గతానుభవాలను దృష్టిలో పెట్టుకొని పనుల కేటాయింపు పంచాయతీకి త్వరితగతిన పనులు అప్పజెప్పాలని ప్రజలు కోరుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం..



డీఎంఎఫ్‌టీ ద్వారా మంజూరైన నిధులలో ప్రస్తుతం రూ.కోటి వ్యయంతో పనులు చేపట్టాల్సి ఉంది. వీటిలో ప్రస్తుతం రూ.30 లక్షల వ్యయంతో బొజ్జాయిగూడెంలో పనులు ప్రారంభించాం. ఇందిరానగర్, సుభాష్‌నగర్, మాణిక్యారం గ్రామపంచాయతీలలో పనులు ప్రారంభించాల్సి ఉంది. త్వరలోనే ప్రారంభించేలా కృషి చేస్తాం.

– రాజు, ఏఈ, పంచాయతీరాజ్‌శాఖ, ఇల్లెందు మండలం

ఇల్లెందులో 99శాతం బొగ్గు ఉత్పత్తి

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు ఏరియా అగ్రస్థానంలో ఉందని ఏరియా జీఎం జాన్‌ఆనంద్ వెల్లడించారు. గురువారం ఇల్లెందులోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనవరి నెలలో సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలను వెల్లడించారు. జనవరికి నిర్దేశించిన లక్ష్యం 4.80 లక్షల టన్నులకు గానూ 4.74 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని చేసి 99 శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు. 1.84 లక్షల టన్నులు బొగ్గు రైలు మార్గం ద్వారా, 0.59 లక్షల టన్నులు రోడ్డు మార్గం ద్వారా ఆర్‌సీహెచ్‌పీ ద్వారా 1.63 లక్షల టన్నులు బొగ్గు రవాణా చేయటం జరిగిందన్నారు. జనవరిలో 50 ర్యాకుల ద్వారా బొగ్గు రవాణా చేశామని వివరించారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని వెలికి తీయాలని, అందుకు ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు.

ఏరియాను అగ్రస్థానంలో ఉద్యోగులను, సూపర్‌వైజర్లను అధికారులను, యూనియన్ నాయకులను అభినందించారు. ఈ సమావేశంలో ఏజీఎం(ఐఈడీ) గిరిధర్‌రావు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు,డాక్టర్ మల్లారెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయుల, పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి ఎంఈఓ ఠాకూర్ రాంసింగ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు సీడబ్ల్యూఎస్ఎన్ ట్రైనింగ్ చేసినందుకు గాను ఐదు సీసీఎల్ మంజూరు చేయాలని, మండలంలో అన్ని పాఠశాలలకు భూ వివరాలు రికార్డు అందించాలని కోరారు. ఆప్షనల్ హాలిడేస్‌పై మండల మొత్తం యూనిట్‌గా ప్రొసీడింగ్స్ ఇవ్వాలని, డిప్యూటేషన్ గురించి కాంప్లెక్స్ హెచ్ఎంలు ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారి పద్ధతి మార్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు వి.వరలక్ష్మి, అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు. ప్రధాన కార్యదర్శి బి.నరసింహారావు, ఉపాధ్యక్షులు బి.మాన్సింగ్. కోశాధికారి బి.రాంజీ, మండల కార్యదర్శులు రాంచందర్, వీరన్న, బి.మంగీలాల్, బి.నాను, జోస్పిన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ ఆదివాసీలకే కేటాయించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఇల్లెందు: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ సీటును ఈసారి ఆదివాసీలకు కేటాయించాలని ఆదివాసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మిట్టగూడెంలో జరిగిన సమావేశంలో ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ దాట్ల నాగేశ్వరరావు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్, ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి, ఆదివాసీ పొలిటికల్ జేఏసీ నేత వాసం రామకృష్ణ, ఆదివాసీ విద్యార్థి సంఘం నేత దబ్బకట్ల సుమన్, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వట్టం సుబద్ర మాట్లాడారు. 2009లో మహబూబాబాద్ స్థానం ఏర్పాటైన నుంచి ఆదివాసీలకు కేటాయించాలని కోరుతున్నా రాజకీయ పార్టీలు పెడచెవిన పెట్టాయని వాపోయారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ టికెట్ కోసం ఆదివాసీ నేత ఎట్టి వెంకన్న గట్టిగా ప్రయత్నం చేస్తున్నాడని, తమ ఆదివాసీ సంఘాల మద్దతు కోరినందున ఈసారి కాంగ్రెస్ ఎట్టి వెంకన్నకు ఇస్తే తామంతా మద్దతుగా పనిచేసి గెలిపించుకుంటామని కాంగ్రెస్ అధిష్టానం ఆలోచన చేయాలని కోరారు.

దళితుల సాగు భూములకు పట్టాలివ్వాలి



తహసీల్దార్ శారదకు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

జూలూరుపాడు: దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో దళితులు గురువారం తహసీల్దార్ శారదకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ సీనియర్ నాయకుడు తంబర్ల నరసింహారావు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్న భూములు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు మూడు ఎకరాల సాగు భూమి ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని ఆరోపించారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దళితులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత రైతులు మందా వెంకటేశ్వర్లు, కత్తి నాగయ్య, గార్లపాటి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



సరుకులు అందజేస్తున్న ఎస్ఐ జీవన్‌రాజు

జూలూరుపాడు: మాచినేనిపేట తండాకు చెందిన భూక్యా పవన్ ఇటీవల మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబానికి జేపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జూలూరుపాడు ఎస్ఐ జీవన్‌రాజు చేతుల మీదుగా నిత్యావసర సరుకులను అందజేశారు. ఏఎస్సై కోటేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, కానిస్టేబుల్ భూక్యా రవి, హోమ్‌గార్డు నరేందర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యుడు గార్లపాటి గణేష్ పాల్గొన్నారు.

వేతనాలివ్వండి



డీసీహెచ్ఎస్ రవిబాబుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను వెంటనే అందించాలని సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, డాక్టర్ సోమరాజు దొరలకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దుగ్గిరాల సుధాకర్, శనగరపు శ్రీనివాసరావు, ఇట్టి వెంకట్రావ్, ఉప్పుశెట్టి రాకేశ్, గిరి, సిబ్బంది దుర్గ, స్వరూపరాణి, నాగలక్ష్మి, రుక్మిణి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలి



మాట్లాడుతున్న వనమా వెంకటేశ్వరరావు

పాల్వంచ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక గట్టాయిగూడెంలోని నాయకులు కిలారు నాగేశ్వరరావు ఇంటి వద్ద బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడారు. 3న కొత్తగూడెంలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కంచర్ల చంద్రశేఖర్‌రావును సన్మానించారు. మంతపురి రాజుగౌడ్, బరపటి వాసుదేవరావు, సరస్వతి, ఎడవల్లి కృష్ణ, మహిపతి రామలింగం, రమణమూర్తి నాయుడు, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, కాంపెల్లి కనకేశ్, కాల్వప్రకాశ్, దాసరి నాగేశ్వరరావు, శ్రీరామ్మూర్తి, చందు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగానే జీపీ భవన స్థలం మార్పు



మాట్లాడుతున్న ప్రమోద్

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం గతంలో రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థలాన్ని ప్రస్తుత అధికారులు ఉద్దేశపూర్వకంగానే మార్చారని వైస్ ఎంపీపీ ప్రమోద్, కోఆప్షన్ ఘాజీ, వార్డు సభ్యుడు కోటేశ్వరరావు ఆరోపించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థలం ప్రస్తుతం కబ్జాకు గురైందని, అందుకోసమే సమీపంలో గిరిజన మహిళకు కేటాయించిన స్థలంలో అక్రమంగా పంచాయతీ భవనం నిర్మించేందుకు శంకుస్థాపన చేశారని చెప్పారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించి ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలని, గతంలో కేటాయించిన స్థలంలోనే పంచాయతీ కార్యాలయ భవనం నిర్మించాలని కోరుతూ కలెక్టర్, ఆర్డీఓలకు వినతిపత్రాలు అందజేశామని వివరించారు.

జీపీలకు ప్రత్యేకాధికారుల నియామకం

ఇల్లెందురూరల్: సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామపంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. మండలంలోని 29 గ్రామపంచాయతీలకు గెజిటెడ్ అధికారులను నియమిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

సుజాతనగర్: సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులను నియమించారు. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా... చాలాచోట్ల రెండు గ్రామాలకు కలిపి ఒక్కో అధికారిని ఏర్పాటు చేశారు.

టేకులపల్లి: జనవరి 31తో సర్పంచ్‌ల పాలన ముగియడంతో టేకులపల్లి మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులను నియమించినట్లు టేకులపల్లి ఎంపీడీఓ కోట వీరబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జూలూరుపాడు: గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ముగియడంతో గురువారం ప్రత్యేక అధికారులను నియమించారు. మండలంలో 24 గ్రామ పంచాయతీలకు 11 మంది గెజిటెడ్ అధికారులు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు.

ఐఎన్‌టీయూసీ కమిటీల రద్దు ప్రకటన అవాస్తవం

కొత్తగూడెంరూరల్: ఐఎన్‌టీయూసీ కొత్త కమిటీల రద్దు ప్రకటన అవాస్తవమని, అసత్య ప్రచారాలను నమ్మొద్దని ఐఎన్‌టీయూసీ నేషనల్ సెక్రెటరీ జనప్రసాద్ అన్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ ముఖ్య నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేషనల్ సెక్రెటరీ జనప్రసాద్ మాట్లాడుతూ.. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నాలుగు ఏరియాలలో ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘం ఘన విజయం సాధించిందన్నారు. ఐఎన్‌టీయూసీ పాత, కొత్త కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషితో ఈ విజయం సాధించినట్లు తెలిపారు. కార్మిక సంఘం విజయంలో కీలక పాత్ర పోషించిన ప్రతీ ఒక్కరికి న్యాయం చేశామని, కొందరు వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కార్మిక సంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. వారి కుట్రలో భాగంగా కొత్తగా ప్రకటించిన కమిటీలను రద్దు చేస్తున్నట్టు వస్తున్న ప్రచారాలలో వాస్తవం లేదని చెప్పారు. ఇలాంటి ఆరోపణలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. కార్యక్రమంలో చిలక రాజయ్య, చెరిపెల్లి నాగరాజు, నటరాజ్, కుమార్, గోపు కుమార్, విప్లవరెడ్డి, విజేందర్, సకినాల సమ్మయ్య, జెల్లీ కిరణ్, మోహన్ రెడ్డి, గోల్కొండ నవీన్, పోచం శ్రీనివాస్, వెజ్జాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు పట్టాలు పంపిణీ చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం పట్టణంలో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటూ యాజమాన్య హక్కులు లేని వారి కోసం ప్రవేశపెట్టిన జీఓ 76 ద్వారా ఇంటిపట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పట్టాలు పంపిణీ చేయాలని బీఎస్పీ పార్లమెంట్ జోనల్ ఇన్‌చార్జ్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ రవీంద్రనాథ్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సాయి, నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.

జీపీ పాలకవర్గాలకు ఆత్మీయ వీడ్కోలు



సుజాతనగర్: సర్పంచ్‌లతో అధికారులు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు

ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న గ్రామపంచాయతీల పాలకవర్గాలకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవీకాలం ముగిసిన సందర్భంగా గురువారం గ్రామాభివృద్ధి కమిటీ, కార్యదర్శుల ఆధ్వర్యంలో సర్పంచ్, వార్డు సభ్యులకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్



పాల్వంచరూరల్: మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు



జూలూరుపాడు సర్పంచ్ విజయ, వార్డు సభ్యులు



ఇల్లెందురూరల్: సుదిమళ్ల గ్రామపంచాయతీ పాలకవర్గం



టేకులపల్లి పంచాయతీ పాలకవర్గం

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



సింగరేణి(కొత్తగూడెం): పర్సనల్ జీఎంకు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఇల్లెందు: ఈనెల 16న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎస్ఏ నబీ కోరారు. గురువారం ఇల్లెందులో కార్మిక శాఖ సహాయ అధికారికి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందజేశారు. షాప్ ఎంప్లాయిస్, సినిమా, మిల్, పెట్రోల్ బంక్, ఆస్పత్రులు, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పని చేస్తున్న కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేస్తారని తెలిపారు. కేంద్రం ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో లైకికవాదాన్ని తుంగలో తొక్కి మత రాజకీయాలు అమలు చేస్తున్నారని తెలిపారు.

జీఎంకు సమ్మె నోటీసు

సింగరేణి(కొత్తగూడెం): సేవ్ సింగరేణి నినాదంతో జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం)కు సీఐటీయూ నాయకులు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పరిశ్రమల అమ్మకం, కార్మిక వ్యతిరేక చట్టాలు, సమస్యలపై ఫిబ్రవరి 16న సింగరేణిలో సమ్మె చేయాలని, ఈ సమ్మెలో సింగరేణి కార్మికులతోపాటు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బొగ్గు బ్లాకుల అమ్మకానికి వ్యతిరేకంగా అఖిల భారత స్థాయిలో కార్మికుల గ్రామీణ భారత్ బంద్ నిర్వహించాలని కోరారు. మందా నర్సింహారావు, శ్రీనివాస్, వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులు గ్రామీణ బంద్ చేపట్టాలి...

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా రైతులు గ్రామీణ బంద్ చేపట్టాలని సీపీఐ, సీపీఎం, న్యూడెమొక్రసీ, ప్రజాపంథా పార్టీల అనుబంధ రైతు సంఘాలతో ఏర్పాటైన సంయుక్త కిసాన్‌మోర్చ జిల్లా నాయకులు కాసాని ఐలయ్య, సలిగంటి శ్రీనివాస్, ముద్దా భిక్షం, అమర్లపూడి రాము, అన్నవరపు సత్యనారాయణలు అన్నారు. గురువారం పట్టణంలోని శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

పాల్వంచరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా విధానాలను నిరసిస్తూ దేశవాప్తంగా ఈనెల16న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు, రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ కోరారు. జగన్నాథపురంలో గురువారం అంగన్‌వాడీ టీచర్లు సమ్మె నోటీసులను సూపర్‌వైజర్లకు అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): కనీస వేతనం రూ 26వేలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీసీసీ హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని తదితర డిమాండ్లతో 16న నిర్వహిస్తున్న దేశవ్యాపిత సమ్మె నోటీసును గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ త్రినాథ్‌బాబుకు అందజేశారు.